క్లుప్తంగా

పోలవరం ఎమ్మెల్యేను పరామర్శించిన బీవీఆర్


జంగారెడ్డిగూడెంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజును పరామర్శిస్తున్న బీవీఆర్ చౌదరి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును ఉభయ గోదావరి జిల్లాల బూత్ కన్వీనర్ల రీజనల్ కో–ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి,చింతల అనిల్ కుమార్‌గౌడ్ పరామర్శించారు. ఇటీవల బాలరాజు గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొంది. ప్రస్తుతం జంగారెడ్డిగూడెంలోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం జంగారెడ్డిగూడెంలోని బాలరాజు నివాసానికి బీవీఆర్ చౌదరి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి


ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును మర్యాదపూర్వకంగా కలిసిన పడమటి గిరిబాబు

జంగారెడ్డిగూడెం: నూజివీడు ఎమ్మెల్యే మేక ప్రతాప అప్పారావును, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబులను వైసీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్ నాయకులతో కలిసి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గిరిబాబుతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతను విధిగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జంగారెడ్డిగూడెం కౌన్సిలర్ నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్, నాయకులు పంది రాజా, గంజి వినోద్ ఉన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోవాలి

టి.నరసాపురం: ప్రజలు ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకుంటే రాబోయే సమస్యలను చాలా వరకు ధీటుగా ఎదుర్కోవచ్చని, లీడ్ బ్యాంక్ అధికారి విశ్వప్రసాద్, కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ గాజులు గణేష్ అన్నారు. బొర్రంపాలెంలో శనివారం కెనరా బ్యాంకు, లీడ్‌బ్యాంకుల ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు సిబ్బంది, సుమారు 100 మంది ఖాతాదారులు పాల్గొన్నారు.

పారిజాత గిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరిలో శనివారం సందర్భంగా వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు వేముల పూడి రాజబాబు, లక్ష్మీ, వేములపూడి బుచ్చిబాబు, నాగసత్యవతి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అభివృద్ధి కమిటీ సభ్యులు పి.జగపతిరాజు, రెడ్డిరంగప్రసాద్, వాసవిశాయి నగేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

వేలేరుపాడు: మండలంలోని టేకూరులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు కారం దారయ్య శనివారం ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన పూరెం కన్నయ్య, పూరెం భీమయ్య, పూరెం రాజమ్మ, ఒక్కొక్కరికీ రూ.వెయ్యి నగదు, 20 కేజీల బియ్యం, కూరగాయలు, దుస్తులు పంపిణీ చేశారు. కరటం శీతామహాలక్ష్మి,కారం కుమారి, వంశీ, నర్సింహులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

కామవరపుకోట: రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2007–2008 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు పాఠశాల గ్రంథాలయానికి రూ.10,000 విలువైన వివిధ పుస్తకాలను శనివారం అందజేసినట్లు హెచ్ఎం ఉమ్మడి భీమరాజు తెలిపారు. తెలుగు ఉపాధ్యాయుడు బిరుదుగడ్డ నాగేశ్వరరావు కృషిని అభినందించారు. ఉపాధ్యాయులు నల్లమోతుల సత్యనారాయణ, మురళి, కిరణ్ కుమార్, బొడ్డు రాములు, కె.సాయికుమార్, కలిసావల్లి, లవ రాజు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

- జగనన్న లే అవుట్లలో యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు
- లబ్ధిదారులకు అవగాహన కల్పించిన అధికారులు


లింగపాలెం జగనన్న లేఅవుట్లలో ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

లింగపాలెం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ మురళీకృష్ణ, హౌసింగ్ ఏఈ ఏలూరి వెంకటేశ్వరావు, లబ్ధిదారులను కోరారు. శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగపాలెం శివారు సందిపాంగూడెం జగనన్న లేఅవుట్‌ను అధికారుల బృందం పరిశీలించి, లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ లేఅవుట్‌లో 69 మందికి ప్రభుత్వం స్థలాలు కేటాయించినట్టు తెలిపారు. ఈ లేఅవుట్‌లో ఇప్పటికి 29 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన స్థలాల్లో ఇళ్ల పనులు ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. ఈ మేరకు లే అవుట్‌లోని లబ్ధిదారుల సమస్యలను అధికారులు తెలుసుకున్నారు. లేఅవుట్‌లో మంచినీటి నిమిత్తం బోరు, మోటార్ ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు తెలపడంతో తహసీల్దార్, హౌసింగ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈనెల 20వ తేదీ నుంచి మంచి నీటి సరఫరాకు సంబంధించిన పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. తామంతా త్వరలో ఇళ్లు నిర్మించుకుంటామని లబ్ధిదారులు అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ, ఏఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లేఅవుట్‌లో యుద్ధ ప్రాతిపదికన మంచినీటి సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. ప్రతి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందజేస్తోందన్నారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా రూ.35 వేలు రుణం అందించనున్నట్లు తెలిపారు. రాయితీపై సిమెంట్, ఇనుము సరఫరా చేయడంతో పాటు ఎలాంటి జాప్యం లేకుండా బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ముందుగా మంచి నీటి బోరును వేసి నీటిని అందించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఇళ్ల నిర్మాణాల ప్రగతిని పరిశీలించి ఇళ్ల ప్రగతిని ఆధారంగా లబ్ధిదారులకు మెటీరియల్, బిల్లులు మంజూరు చేస్తామన్నారు. మండలంలో జగనన్న లేఅవుట్లు 30 ఉన్నాయని వీటిలో 1,046 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాన్నారు. ఇప్పటి 27 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ ఇళ్ల నిర్మాణం పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు, కార్యదర్శులకు ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీవో కేపీ కామేశ్వరి, పీఆర్ ఏఈ జగన్నాథరావు, ఏపీయం కమలాదేవి, కార్యదర్శ సుగుణరావు, పలుశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోలవరంలో హౌసింగ్ డే

పోలవరం రూరల్: గృహ నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ కేవీ రమణారావు లబ్ధిదారులకు కోరారు. పోలవరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద హౌసింగ్ డే సందర్భంగా లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. మండలానికి 897 గృహాలు మంజూరయ్యాయని, 150 గృహ నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన వారు కూడా గృహనిర్మాణాలు ప్రారంభించాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలతో పాటు, ఇసుక ఉచితంగా అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, ఏపీవో కె.వెంకటరమణ, ఏపీఎం బి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసిల్దార్ ఎం.ప్రసాద్, కార్యదర్శి వై.కొండలరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

చింతలపూడి: పాఠశాలలకు వచ్చే పిల్లల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ వహించాలని జిల్లా విద్యా శాఖాధికారి రవి సాగర్ ఆదేశించారు. మండలంలోని ఊటసముద్రం ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. నాడు–నేడు పనులను పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తాగు నీరు, పరిసరాల పరిశుభ్రత విద్యార్థుల మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలో స్వచ్ఛమైన తాగు నీరు విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని అన్నారు.

నేటి నుంచి కనకదుర్గమ్మ వార్షిక మహోత్సవం

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెంలోని కొలువుదీరిన శ్రీ చక్ర సహిత కనకదుర్గ మల్లికార్జున స్వామి వార్షికోత్సవ కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజతో ప్రత్యేక పూజలు ప్రారంభమై ఏడవ తేదీ మంగళవారం వరకు మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. ఆరవ తేదీ సోమవారం రాత్రి 7 గంటలకు దుర్గా మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ అర్చకులు వెలవలపల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో 13వ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ ధర్మకర్త తోరం సుబ్బారావు పర్యవేక్షణలో మూడు రోజులపాటు ఆధ్యాత్మిక, అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆస్తి పన్ను వసూలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో బకాయిదారుల నుంచి ఆస్తి పన్ను వసూలైనట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ తెలిపారు. శనివారం మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి ఆస్తి పన్ను బకాయి వసూలు చేశామన్నారు. ఈ క్రమంలో నగదు రూపంలో రూ. 8,24,315, చెక్కుల రూపంలో రూ. 3,58,000 వసూలు అయినట్లు ఆయన తెలిపారు. ఆర్ఐ ఎస్.సుబ్బారావు, మేనేజర్ కె.వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

కొయ్యలగూడెం: ప్రభుత్వ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నాలుగో రోజు శనివారం కొనసాగింది. వలంటీర్లతోపాటు నూతనంగా సచివాలయ కన్వీనర్లుగా బాధ్యతలు స్వీకరించిన వారు, గృహ సారథులు లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేయడంలో సహాయపడ్డారు. మండల వ్యాప్తంగా 10,101 మంది లబ్ధిదారుల్లో 9,900 మందికి 98.01 శాతంతో పెన్షన్లను పంపిణీ చేసినట్లు జగనన్న సచివాలయ మండల కోఆర్డినేటర్ నూకల రాము పేర్కొన్నారు. రూ.2.78,35,000 లబ్ధిదారులకు పింఛను రూపంలో అందజేశామన్నారు. బయ్యన్నగూడెంలో సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి సుబ్బారావు, వలంటీర్లు, గృహసారథులు చేబత్తుల వెంకటలక్ష్మి, కారింకి కష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

చింతలపూడి: భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, బాధ్యతలు కల్పించిందని ప్రముఖ న్యాయవాది ఎండీ ఉమర్ ఫరూఖ్ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూనియర్ సివిల్ జడ్జి పి పరేష్ కుమార్ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం మహిళా చట్టాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పలువురు మాట్లాడుతూ దేశంలో మహిళలకు అనేక రక్షణ చట్టాలను రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళలకు సమానత్వం, రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. గృహహింస చట్టం, వరకట్న వేధింపుల చట్టం, పోక్సో, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు కొవ్వూరి కనకదుర్గ భవాని, పారాలీగల్ వలంటీర్లు ఎండీ అక్బర్ ఆలీ, సీడీపీఓ మాధవి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

జంగారెడ్డిగూడెం: మహిళలకు రక్షణ కల్పించేందుకు నిర్దేశించిన చట్టాలపై మహిళా పోలీసులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ ఆర్. వరలక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణంలో మహిళా చట్టాలపై మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 4నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మహిళా పోలీసులు మహిళా చట్టాలపై అవగాన కలిగి ఉండటంతో ఈ వారం రోజులు ఆయా సచివాలయాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ రాజరాజేశ్వరి తేజస్వి పాల్గొన్నారు.

వైభవంగా విజయదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ


జంగారెడ్డిగూడెం విజయదుర్గమ్మ గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని పాత ఆంధ్రాబ్యాంక్ వీధిలో శుక్రవారం ప్రతిష్ఠించిన విజయ దుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు నాలుగు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం నిర్వహించిన మహాపూర్ణాహుతితో ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయింది. విజయదుర్గ అమ్మవారి ధ్రువమూర్తికి సహస్ర కలశాభిషేకం, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాల అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించి అవభృత స్నానం, తీర్థప్రసాదాల వినియోగం పూర్తి చేశారు. సాయంత్రం వేద ఆశీర్వచనం, పండిత సత్కారం అనంతరం గ్రామోత్సవం మేళతాళాలతో నిర్వహించారు. శివ పార్వతులకు శాంతి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈమని శశి కుమార్, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ సహకరించిన ప్రతి ఒక్కరికీ, భక్తులకు, దాతలకు మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు, ఉపాధ్యక్షుడు కందులపాటి శ్రీనివాసరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, గుడిమెట్ల యుగంధర్, కందులపాటి సురేష్, గుడిమెట్ల సత్యనారాయణ(జీఎస్), కర్పూరం మహేశ్వరరావు, గెడ్డం శ్రీనివాస్, యర్రం ఉదయ్‌కుమార్, వందనపు అప్పలరాజు, కర్పూరం తుకారం, తొంటా శ్రీనివాసరావు, బిక్కిన మోహన్ బాబు, రాజపురోహిత్ అశోక్ సింఘాల్, వీరవల్లి శ్రీనివాస్, జల్లిపల్లి శివకృష్ణ, జోరిగే సాయిరాం, మారిశెట్టి అంజన్‌కుమార్, కె.శివ పాల్గొన్నారు.

పథకాలపై పర్యవేక్షణ అవసరం


పరింపూడి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ఝాన్సీ రాణి

కొయ్యలగూడెం: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై తరచూ పర్యవేక్షించడం వల్ల బహిర్గతమయ్యే లోటుపాట్లను సరిచేసుకునే అవకాశం ఉంటుందని ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. శనివారం పరింపూడి ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రం కోడ్ నంబర్–7లో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి నాణ్యత తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అభ్యున్నతి ద్వారా చిన్నారులకు గర్భిణులకు బాలింతలకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందజేస్తుందని, ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు పర్యటించాలని సూచించారు. కొయ్యలగూడెం సచివాలయం కేంద్రం–3లో ఆకస్మిక పర్యటన నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బందిని పలు రికార్డులకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకుని పెండింగ్‌లో ఉన్న వాటి విషయాలను పరిష్కరించేందుకు సూచనలు అందజేశారు. ఆర్డీఓ వెంట ఆర్ఐ మణి దివ్య పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీ


ఎర్రబోరు పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ మొహ్మద్ మదనీ

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలోని ఎర్రబోరు మండల పరిషత్ పాఠశాలను, జంగారెడ్డిగూడెం ఆర్‌టీఏ, వేలేరుపాడు మండల స్పెషల్ ఆఫీసర్ మొహ్మద్ మదనీ శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధనపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో మొత్తం 28 మంది విద్యార్థులుండగా, 12 మంది మాత్రమే పాఠశాలకు హాజరయ్యారు. మిగతా పిల్లల్ని పాఠశాలకు రప్పించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయుడ్ని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. ఇక్కడి అంగన్‌వాడీ, కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో 17, మంది పిల్లలకు 11 మంది అంగన్‌వాడీ కేంద్రంలో హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రంలో పరిసరాలు, ముగుదొడ్ల పరిస్థితిని మెరుగుపర్చాలని కార్యకర్తకు సూచించారు. వేలేరుపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ కె.చల్లన్నదొర తనిఖీ చేశారు.

విద్యార్థిని అదృశ్యం

ద్వారకాతిరుమల: ఇంటి నుంచి కాలేజీకి వెళ్లిన ఒక విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటనపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఎస్సై తెలిపిన కథనం ప్రకారం మండలంలోని తిమ్మాపురానికి చెందిన విద్యార్థిని భీమడోలులోని శ్రీ వేంకటేశ్వర కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రోజులానే ఈనెల 2న ఉదయం ఆర్టీసీ బస్సు ఎక్కి కాలేజీకి వెళ్లిన ఆ విద్యార్థిని సాయంత్రానికి తిరిగి ఇంటికి రాలేదు. దాంతో కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బాల్యవివాహం చట్టరీత్యా నేరం

ద్వారకాతిరుమల: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాలలు చదువుపై మాత్రమే శ్రద్ధ చూపాలని సీహెచ్.పోతేపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు యజ్ఞశ్రీ అన్నారు. శనివారం స్థానిక శ్రీ సత్యసాయి విద్యాగిరి హైస్కూల్ విద్యార్థినులతో కలిసి గ్రామంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ ఫార్మసిస్ట్ సీహెచ్ మాలతి, ఏఎన్ఎం దాసరి గాయత్రి, ప్రిన్సిపాల్ గోటూరి శేఖరం, ఉపాధ్యాయులు ఎం.జాన్, ఎం.వెంకట్రావు, కె.రవికుమార్, జి.అనంత పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో తన కుమారుడు కాలు కోల్పోవడానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలుకు చెందిన మోతే రాములు శనివారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తెలంగాణకు చెందిన మోతే రాజు వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, దొండకాయల లోడుతో రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళుతూ గత నెల 5వ తేదీ ఉదయం వేగవరం సెంటర్‌లో ఆగాడన్నారు. తిరిగి ప్రయాణమయ్యే సమయంలో వ్యాన్ ఎక్కుతుండగా, వేగవరం సెంటర్‌లో ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను నడుపుతూ రాజును ఢీకొన్నాడన్నారు. రాజు వ్యాన్ డోర్ మధ్యలో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడని, వెంటనే 108లో ఖమ్మం తీసుకువెళ్లగా, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారన్నారు. ఈ క్రమంలో ప్రమాదంలో నుజ్జయిన రాజు కాలిని వైద్యులు తొలగించారన్నారు. ఆ మేరకు రాజు తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ


బుట్టాయగూడెంలో నవధాన్యాల వినియోగంపై అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: నవధాన్యాల సాగుపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలని ఏఓ బి. సుమలత అన్నారు. శనివారం మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో ప్రకృతి వ్యవసాయంలో 30 రకాల నవధాన్యాల సాగు ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని కోరారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడడం వల్ల నేల సారాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ప్రకృతి వ్యవసాయ అధికారి వై. ములసయ్య మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలంలో 10 సచివాలయాల పరిధిలో 24 వీఓల్లో 2,708 మంది రైతులు 3,696 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్నారని చెప్పారు. సీ1, ఎస్2ఎస్, సీ5గా విభజించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఏపీసీఎన్ఎఫ్ కేడర్ ద్వారా అమలు చేస్తున్నట్టు చెప్పారు. గతేడాది నుంచి 18 నుంచి 20 రకాల నవధాన్యాలను పంటలకు ముందు పొలాల్లో వేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎమ్ పద్మావతి, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి సీఎహచ్ వెంకటేష్, వ్యవసాయ సహాయకులు, హెల్త్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్లు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 2.52 లక్షల విరాళాలు


దాత ఏడుకొండలుకు విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు


దాత అమరేంద్రనాథ్ చౌదరికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముగ్గురు భక్తులు వేర్వేరుగా శనివారం రూ. 2,52,232 విరాళంగా అందజేశారు. మైలవరం మండలం వెలవడం గ్రామానికి చెందిన లేళ్ల ఏడుకొండలు రూ. 1,01,116 ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావుకు అందజేయగా, ఆయన దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. ద్వారకాతిరుమల మండలం సూర్యచంద్రరావుపేటకు చెందిన పాకలపాటి అమరేంద్రనాథ్ చౌదరి రూ. 1,01,116, హైదరాబాద్‌కు చెందిన ఎం.జగన్నాథరావు రూ. 50 వేలను ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాతలకు ఆలయ ఏఈఓ ఎం.దుర్గారావు విరాళం బాండ్ పత్రాలను అందజేశారు. దాత అమరేంద్రనాథ్ చౌదరి వెంట స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాలు, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

నేడు తాగునీటి ట్యాంకుల ప్రారంభం


కన్నాపురం పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్

కొయ్యలగూడెం: అవంతి ఫౌండేషన్ సౌజన్యంతో నిర్మించబడిన ఏడు వాటర్ ట్యాంకులను, ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు కన్నాపురం సర్పంచ్ ఉప్పల పద్మావతి పేర్కొన్నారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో అవంతి ఫీడ్స్ అధినేత అల్లూరి ఇంద్ర కుమార్ తన తల్లిదండ్రులు అల్లూరి సుభద్రమ్మ, వెంకటేశ్వరరావు పేరుతో వీటిని నిర్మించినట్లు వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గాడిచర్ల సోమేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఇంద్రకుమార్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తున్నామన్నారు. పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్, వాటర్ ట్యాంకుల మంజూరు విషయంలో ఇంద్రకుమార్ పిన తల్లి కొడాలి సూర్యకాంతం ప్రత్యేక కృషి చేశారని ఈ సందర్భంగా సూర్యకాంతం, డాక్టర్ సత్యనారాయణ దంపతులకు పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

గురుకుల పాఠశాల భవనాలు నిర్మించాలి

చింతలపూడి: డా. బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి చేసి, సౌకర్యాలు కల్పించాలన్నారు. మండలంలోని కొమ్ముగూడెం వద్ద చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ఆయన పరిశీలించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్,డేగా ప్రభాకర్, దోనేపూడి శంకర్, జిల్లా సీపీఐ కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఎన్‌టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, మండల కార్యదర్శి కె గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ హామీపై హర్షం

కొయ్యలగూడెం: చేతివృత్తిదారులకు ప్రభుత్వ సహాయంతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని హామీ ఇచ్చిన పరింపూడి సర్పంచ్ ముప్పిడి విజయకుమార్‌కి పలు సంఘాలు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు సెంట్లు స్థలాన్ని పంచాయతీ ద్వారా కేటాయిస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారని వాసా ప్రసాద్, సూది కొండల శివాజీ గణేష్ తదితరులు తెలిపారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

జంగారెడ్డిగూడెం: సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం ఎంపీసీ, బీజెడ్‌సీ విద్యార్థులు శనివారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను సందర్శించారు. కళాశాల జువాలజీ అధ్యాపకులు సీహెచ్ వెంకటేశ్వర్లు, రసాయనశాస్త్ర అధ్యాపకులు పీటీఆర్‌కే ప్రసాద్ పలు అంశాలు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు విజయదీపిక, సీహెచ్ వెంకటలక్ష్మి ఉన్నారు. ఫీల్డ్ విజిట్‌లో సహకరించిన పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, వి.బాబురావుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

తాడువాయి హైస్కూల్లో గ్రామర్ డే

జంగారెడ్డిగూడెం రూరల్: తాడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నేషనల్ గ్రామర్ డే నిర్వహించారు. విద్యార్థులకు గ్రామర్‌పై పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి హెచ్ఎం జి. రాములు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయురాలు లోవకుమారి, ఉపాధ్యాయుడు ఆలీ పాల్గొన్నారు.